# ఏమనమన్నారు?

"—అది కాదండీ: ఆవిడ చెప్పేదంతా అబద్ధం. ఆవిణ్ణి నే నసలు ఎరుగను. ఆవిడ నా భార్య కానూ కాదు. నే నామెకు భర్తనూ కాదు. అంతా అబద్ధం" అని నెత్తీ నోరూ కొట్టుకుంటున్నా డతను.

ఆవిడ ప్రారంభించింది.

"చూశారా, చూశారా; నాదా అబద్ధం, పోనీండి. అంటే అన్నారు. నా మొగుడు నన్ననకపోతే యింకెవ రంటారు. అగ్నిసాక్షిగా పెళ్ళిచేసుకున్న మీరు అబద్ధమాడితే మాత్రం వీళ్ళంతా నమ్ముతారా? నమ్మితే మాత్రం, నే నొదిలిపెడతానా?" అని అంటూం దామె.

ఆ యిద్దరి చుట్టూ, నెమ్మది నెమ్మదిగా మనుషులు పోగై చివరకు పెద్ద సమూహంగా తయారయింది. వింతగా నోళ్ళు తెరుచుకు చూస్తున్నారు. ఎవరికీ ఏమీ అర్థం కావటం లేదు. ఆమె అతని చొక్కా చివర పట్టుకుంది. అతనేమో ఆమెను విడిపించుకోటానికి ప్రయత్నిస్తున్నాడు. ఆవిడ విడిచిపెట్టడంలేదు. యింతమంది జనంలో, నడిబజార్లో, జరుగుతున్న ఈ అవమానానికి అతని ముఖం ఎర్రబడిపోయింది. అపోనీ ఆ పట్టుకున్నది మరో మొగాడు అయినట్టయితే, మొహం పగిలేట్టు ఓ తన్ను తన్నేవాడేమో! ఆడది! పొరపాటున చెయ్యిచేసుకుంటే చూశావా? ఆడదాన్ని తంతున్నా డంటారు. ఊరుకుందామా విడిచిపెట్టేట్టు లేదు. ఏం చెయ్యడం?

ఏం తోచడంలే దతనికి. నిస్సహాయంగా తన చుట్టూ మూగిన జనాన్నుద్దేశించి; "అయ్యా! మీరైనా చెప్పండి. ఈవిడకు మతేమైనా పోయిందేమో నాకు తెలియదు. ఈవిడ నా భార్య కాదు." అని ప్రారంభించేసరికి, వెంటనే ఆమె కూడా అందుకుని, "చెప్పండి బాబూ, చెప్పండి, ఆయన కేమైనా మతి పోయిందేమో? పెళ్ళాం ఏదైనా తప్పుచేస్తే సరిదిద్దుకోవలసింది మొగుడవునా కాదా? మీరు కాపరాలు చేస్తున్న వాళ్ళేగా? మీ భార్య లేమైనా చిన్న తప్పులు చేస్తే మీ రిలాగే విడిచిపెడుతున్నారా? చెప్పండి బాబూ, చెప్పండి" అని ప్రాధేయ పడడం మొదలుపెట్టింది.

ఏమని చెప్పడానికీ ఎవరికీ నోరు పెగలడంలేదు. యిదంతా చూస్తుంటే జనానికి వున్న మతి కాస్తా పోయింది. చివరకు గుంపులోంచి ఎవరో సాహసించి, "నిజంగా మొగుడు కాకపోతే పరాయి మగాణ్ణి పట్టుకు పదిమందిలోనూ నా మొగుడని చెప్పుకునే ఆడదుంటుందా?" అని ప్రశ్నించాడు.

వెంటనే మరొకరు అందుకుని "ఎంత పెద్ద తగువు లొస్తే మాత్రం, పదిమందిలోను నా పెళ్ళాం కాదనే మొగాడుంటాడా?" అని అన్నాడు.

"ఆ సంగతి తెలిస్తే యికనేం?" అన్నారు మరొకరు.

## శ్రీ వి. రామకృష్ణ

ఈ రకంగా పదిమందీ పది రకాల ప్రశ్నలు వేసుకున్నారు. పది రకాల సమాధానాలు చెప్పుకున్నారు. కాని, వాళ్ళిద్దరూ భార్యాభర్త లవునా కాదా అనేది మాత్రం తేల్చలేకపోయారు.

ముందు 'అతన్ని' ఆపాద మస్తకం వరకూ పరిశీలనగా చూశారు. కాళ్ళకు చెప్పులున్నాయి. మామూలు గుడ్డలు వేసుకున్నాడు. చూడ్డానికి యీనాటి మధ్య తరగతి కుటుంబీకునిలా కనిపిస్తున్నాడు.

ఆవిణ్ణి కూడా అలాగే పరిశీలనగా చూశారు. కొన్ని ప్రశ్న లొచ్చాయి.

"అరె! కాళ్ళకు మట్టెల్లేవే?" అన్నా డొకడు.

కొంతమందికి ఆశ్చర్యం కలిగి మరింత పరిశీలనగా చూశారు. క్షణం తర్వాత మళ్ళీ వాళ్ళే సమాధానం చెప్పుకున్నారు. "ఆ! ఈ రోజుల్లో కాళ్ళకు అందెల కడియాలు, పాంజేబీ పట్టాలు, వేళ్ళకు మట్టెలు పెట్టుకునే దెవరు? అవి 'మోటు' అయిపోయి ఎన్నాళ్ళయింది?"

"అదీ నిజమే" అన్నారు కొందరు.

"పోనీ మంగళసూత్రమైనా వుందా?"

"ఏమో, వుందో లేదో?"

"మెళ్ళో ఏదో సన్నగా తాడులా కనిపిస్తోందే?"

"ఆ! అయితే సరే! ఇకనేం? మంగళసూత్రానికి పూర్వంలా యిప్పుడు నూలుతాడు కాదుగా. సన్నగా




చర్మబాధల కన్నిటికి
సైబాల్


చర్మవ్యాధు లన్నిటిని శీఘ్రంగా నివారణచేసి, విషక్రిమి నాశనియై త్వరితంగా కుదుర్చుటలో "సైబాల్" ప్రసిద్ధి కెక్కింది. కురుపులు, గజ్జి, ఎగ్జిమా, స్కాబీస్, మొటిమలు, తామర, కాళ్ల పగుళ్లు, వ్రణములు మొదలైన వాటిని కుదర్చడంలో అద్భుతంగా పనిచేస్తుంది.

బిడ్డల ఆరోగ్యమునకు
ప్రసిద్ధి చెందినది.
రమణీస్ బేబి గ్రైప్




తయారీదారు
ది సౌత్ ఇండియన్
మాన్యుఫాక్చరింగ్ కో., మధుర.

డిస్ట్రిబ్యూటర్సు:
సీతారామ జనరల్ స్టోర్సు ఏజెన్సీస్
విజయవాడ, సికింద్రాబాద్,
బరంపురం (గంజాం), బొంబాయి, బెంగుళూరుసిటీ



ఏం తోచడం లేదతనికి

కైనుగా బంగారపు గొలుసు చేయించి అందులో తగిలిస్తున్నారు మంగళసూత్రాలు 'నాంకేవాస్తే'.

"ఏం లోకమో? ఏం మనుషులో! ఛీఛీ రామరామ" అనుకున్నా డాకాయన.

ఎవరే మనుకున్న ఆ గుంపు అక్కణ్ణుంచి చెదరదు. వాళ్లిద్దరూ అక్కణ్ణుంచి పోరు. అతను పోదామని ప్రయత్నించినా ఆమె పోనివ్వడం లేదు "ఆ ఒక్క డికి?" అంటుంది.

"అటు గాక యింకెటూ?;" అంటా డతను.

"ఇంటికి?" అంటుందామె.

"ఎవరింటికి?" అంటా డతను.

"ఎవరింటి కేమిటి? మనింటికే?"

"మనిల్లా? మని ల్లేమిటి?"

"మళ్లీ మొదలా?"

"మొదలేమిటి?" "కానేమిటి? మ వ్వెవరో నాకు తెలియదు. నన్ను పట్టుకు వేళ్లాడతా వేమిటి? ఆడదాని వని యింతసేపట్నుంచి సందేహిస్తున్నానా?..."

"కాకపోతే ఏం చేస్తారూ?" గట్టిగా తంతా నంటారు. అంతేగా. సరే! కానివ్వండి; యిదివరకు తిన్న తన్నులకంటే ఎక్కువేం కాదుగా?"

ఆవిడ అన్నింటికి తెగించింది. అందరిలోను భారతనారి అనిపించుకుంది. చాలా మందికి కొన్ని సందేహాలు నివృత్తి అయినయ్.

పరాయి ఆడదేగనక అయితే తన్నులు తినడాని కయినా ఎందుకు సిద్ధపడుతుంది. అంత ఓర్పు ఒక్క భార్యకు మినహా మరెవ్వరికీ వుండదు సహజంగా. ఈ నిర్ణయానికి కొందరు వచ్చి రావడం తోనే వెంటనే అడిగేశారు అతన్ని: "చాల్లే వూరుకో వయ్యా. యిందాకట్నుంచీ, చూస్తున్నాం. పదిమంది లోనూ పట్టుకుని తంతానన్నావంటే యింటిదగ్గర ఎవ్వరికీ తెలీకుండా ఎన్నిసార్లు తన్నావో?"

"తంతానని నే ననలేదండీ!" అన్నాడు 'అతను'.

"మళ్లీ అనలేదంటావేం; యిప్పుడేగా నువ్వన్నదీ?"

"అది కాదండీ......"

"అదికాదు, యిది కాదు, యిక చాల్లే వూరుకో. పెద్ద మొగాడివి బయల్దేరావు......"

"ఏమండోయ్ మీరు చాలా పొరబడుతున్నారు. మొదట్నుంచీ నేను నిజం చెబుతున్నా. ఆవి డెవరో నాకు తెలియదు. ......"

"సరే, తెలియదే అనుకో. ఆవిడ నిజంగా పిచ్చిదే అనుకో. అయితే యింత మంది మొగాళ్లుండగా నిన్నే పట్టుకు ఎందుకు వేళ్లాడుతుందీ అంటా!" నిగ్గదీసి నిలేశా డొకాయన.

"ఆ! అదీ సంగతి!" సమర్థించారు మరొకరు.

"అబ్బే ఈ రోజుల్లో ఆడదంటే మరీ చులక నయిపోయింది" అన్నాడు మరొకడు స్త్రీల పట్ల సానుభూతి పరుడు.

"అబ్బే ఈ రోజుల్లో కుర్రకారును యిట్లా, నాకెట్లీ, మరీ పెద్ద గొడవవుతా వుంది"

అన్నాడు మరొక పెద్దమనిషి.

ఇవన్నీ వింటూంటే అతనికి చెమటపట్టింది. ఇక తను చెప్పేది ఎవరూ నమ్మేట్టు లేరు. ఇంకా నయం, తనను మందలింపుగా ఎవరూ చేయి చేసుకోలేదు. అది కూడా సమీపించేట్టుగానే వుందనిపించింది. పంచెతో ముఖంమీది చెమటను శుభ్రంగా తుడుచు కుని తన చుట్టూ మూగిన జనాన్ని ఒక్కసారి, తనకు తెలియని, తన భార్యను చూసి ఉపన్యాసాల ధోరణిలో, "అయ్యా, సోదర సహో పురుషులారా, నా జీవితంలో నేను పొందిన గొప్ప అవమానం యిదొక్కటే. న్యాయం, ధర్మం, తలకాయల మీద ఆధారపడి వున్న దనే సంగతి యీనాడు అక్షరాలా స్వానుభవం ద్వారా తెలుసుకున్నాను. ఈ సంగతే ఏ చిన్న రాజకీయ నాయకుడికైనా చెప్పివుంటే ఫలానాయన యిలా ఉద్ఘాటించాడు అంటాయేగాని నాతాలూకు యీ గొప్ప స్వానుభవాన్ని గురించి ఏ పత్రికా పిసరం తయినా వార్తగా వెయ్యదు. సరే పోనివ్వండి. యింతకీ నేను చెప్పే దేమిటంటే — ఉండండి. నన్ను చెప్ప నివ్వండి — ఆవి డెవరో నాకు తెలియదు. నిజంగా నాకు తెలియదు. ఒక ఆడది, కంట తడిపెట్టి కాళ్లా వేళ్లా పడుతూ ప్రాధేయపడినంత మాత్రాన, నిజా నిజాలు తెలియకుండా, మీ రందరూ నన్ను ఏకగ్రీ వంగా మందలిస్తున్నారు. ఇది చాలా శోచనీయ మైన విషయం. ముక్కూ మొహం తెలియని పరాయి స్త్రీ తనకు తానై వలచివస్తే తిరస్కరించే మొగవా డంటూ ఎవరూ వుండరేమో! నేనూ తిరస్కరించే వాణ్ణి కాదేమో ఒప్పుకుంటాను. కాని, యిప్పుడు పొతు

(మిగతా 60 వ పేజీలో)

## ★ ఏం మనుషులు? ★

(18 వ పేజీ తరువాయి)

భార్యా పిల్లలూ వున్నారు. మీరన్నట్టు ఆమెను భార్యగా స్వీకరించి వెంటబెట్టుకుని యింటికి వెళ్తా, నా సత్కార్యం తప్పకుండా జరిపి తీరుతుంది. నే నా అవస్థ పడలేను. కాబట్టి నా యందు దయయుంచి..." అని చెబుతున్న మాటలు పూర్తి కాకముందే జనంలో రణగొణ ధ్వని బయలుదేరింది. "ఇక ఆపవయ్యా, అపు నీ ఉపన్యాసం" అన్నా రొకరు.

"అట్నే చూస్తూ కూచుంటే లాభంలేదు" అన్నారు మరొకరు.

"ఇదిగో, ......అమ్మాయ్...... నువ్వనవసరంగా పీడవ కమ్మాయ్. ఎందుకూ ఏడవడం?" అని అటన్ని ఉద్దేశించి, "ఇదిగో, అబ్బాయ్... నేనేదో పెద్దవాణ్ణి చెబుతున్నాను విను. భార్యా భర్త లన్న తరువాత ఎప్పుడో ఒకప్పుడు అభిప్రాయ భేదా లంటూ రాకపోవు. అంతమాత్రంచేత యిల్లూ వాకిలీ విడిచి పారిపోతారటయ్యా పిచ్చోడా! యిదిగో నా మాట విని........" "అతను" నిలువునా నీరైపోతున్నాడు జనంవైపు పిచ్చి పిచ్చిగా చూడ్డంకంటే మరేం చెయ్యలేకపోతున్నాడు. ఆవిడ మాత్రం తన వెక్కి చివర వదిలిపెట్టడం మానలేదు. సరిగదా, వేళ్లతో మెలిబెడుతోంది. చివరకు తెగించి తన కెదురుగా వున్న పెద్దమనిషి నుద్దేశించి "యింతకూ మీ రనే దేమిటి?" అన్నాడు.

"ఏం లేదు. అయిందేదో అయిపోయింది. ఏ అల్లరీ లేకుండా యించక్కా బండి కట్టించుకుని యింటికి పొమ్మంటున్నా" అన్నా రాయన.

ఒక్క క్షణం ఆవిడకేసి చూసి దీర్ఘంగా నిట్టూర్చి "సరే! కానివ్వండి" అన్నాడు. వెంటనే జనంలో గోలగా చప్పట్లు, ముసి ముసి నవ్వులు బయలుదేరినయ్. వెంటనే దూరంగా పోతున్న ఓ జట్కా బండిని పిలిచారు. నెమ్మదిగా ఆ భార్యా భర్త లిద్దరినీ ఆ బండి దాకా తీసుకెళ్లారు. పెద్దలు సాగనంపడానికి. బండివరకూ వచ్చి యిక ఎక్కడమే తరువాయిగా నుంచుని, ఆ భార్యా భర్త లిద్దరూ తమ చుట్టూ మూగిన జనసమూహాన్ని చూసి స్పష్టంగా చక్కగా నవ్వేశారు.

పెద్దలందరూ తెల్లమొహా లేశారు.

"ఏ మయింది? ఏ మయింది?" అన్నీ ప్రశ్నలే.

"వాళ్లిద్దరూ నవ్వుతున్నారు.?"

"ఎందుకూ?"

"____________"

'అతను', 'ఆమె' భుజంమీద చెయ్యివేసి, సిగరెట్ కాలుస్తూ ఠీవిగా నించుని తమ చుట్టూ మూగిన జనా న్నుద్దేశించి, యిలా చెప్పడం ప్రారంభించాడు.

"సోదర మహాశయులారా! యింతసేపూ మీకు మేము శ్రమ కలిగించా మనుకుంటాము. యిందుకు మేము హృదయపూర్వకంగా క్షమాపణ కోరుకుంటు న్నాము. ఇది కేవలం ఫ్యాన్సీ డ్రెస్ కాంపిటీషన్. మా నాటక సమాజంవారు వరద బాధితుల సహాయార్థం మ్యూజియం థియేటర్‌లో ప్రదర్శింపబోయే "ఏం మనుషులు" అనే నాటకానికి యిది కేవలం నాందీ ప్రస్తావన లాంటిది మాత్రమే! ఈ నాందీ ప్రస్తావనే మిమ్మల్ని యింతగా ఆకర్షించిందంటే మా నాటకాన్ని గురించి వేరే చెప్పనక్కర లేదు. ప్రతిభావంతులైన నటులతో, జీవితపు చీకటికోణాల అట్టడుగున పడి కనుపించని సత్యాన్ని కళ్లకు కట్టేటట్లు ప్రదర్శింపబడే "ఏం మనుషులు" అనే నాటకం వచ్చే ఆదివారం ఉదయం ఎనిమిది గంటలకు ప్రదర్శిస్తారు. వరద బాధితుల సహాయార్థం మేం చేస్తున్న యీ సత్కార్యంలో మీరూ సహాయపడతారని ఆశిస్తున్నాం" అని వా ళ్లిద్దరూ నమస్కారం పెట్టి బండిలో కూచున్నారు.

ఆ పెద్దలందరూ ఆశ్చర్యంగా ముందు పోతున్న బండివైపు అలాగే చూస్తూండిపోయారు.

"హరి, వీళ్లదుంపతెగా!" అన్నా రొకరు.

"ఏం లోకమో! ఏం మనుషులో! ఛీ, ఛీ రామరామ" అన్నారు మరొకరు.

అమ్మకమునకు తయారుగా నున్నది

84 పేజీలు అనేక విషయములు తెలియజేయు

ఆంధ్రప్రభ

దుర్ముఖినామ సంవత్సర పంచాంగము

1956 - 57

బ్రహ్మశ్రీ కే. యస్. రామమూర్తి సిద్ధాంతిగారిచే

గుణింపబడినది.

ప్రతి 1 కి రు. 0-4-0. తపాలు చార్జీ రు. 0-2-0.

అన్ని కేంద్రములలో మా ఆంధ్రప్రభ ఏజంట్లవద్ద లభించును.

ప్రతి 1కి రు. 0-6-0 మనీఆర్డరుద్వారా క్రింది విలాసమునకు పంపిన పొందవచ్చును.

మేనేజరు, ఆంధ్రప్రభ, మద్రాసు-2.

## ★ దాగిన సత్యం ★

(28 వ పేజీ తరువాయి)

మూర్తి యెప్పుడూ ఆమె నోటి వెంట అటు వంటి మాట వినలేదు. ఆమెలోని ఆ సంచలనం తీరని అనుభూతి కలిగించింది. "క్షమించవూ!" అన్న ఆమె వాక్యం కరడు గట్టుకు పోయిన అతని హృదయాన్ని పూగించి కరిగించి వేసింది.

"లే పిచ్చిదానా?" అన్నాడు ఆప్యాయంగా మూర్తి ఆమె తలమీద చేయివేసి.

"క్షమించనిదే ఇక్కడనుండి యింక లేవను" అంటూ మూర్తి పాదాలని కావలించుకొని వుండి పోయింది కమల.

"క్షమించడానికి నువ్వు తప్పు చేస్తేగా!" అన్నాడు మూర్తి ఆమె తల నిమురుతూ.

ఇంతవరకూ నిశ్చేష్టుడై వున్న ముసలాయన తేరుకున్నాడు.

"లే అమ్మా! యింక యింటికి వెళదాం!" అన్నాడు సంతోషంగా.

"ఎందుకు నాన్నా! యింకా నన్ను బాధ పెడతావ్!" అంది కమల బాధగా.

"ఏమి టంటావమ్మా!" అన్నాడు తెల్లబోయి.

"ఇంక మళ్ళా ఆ యింటి గడప తొక్కను. అది నా యిల్లు కాదు. ఆ అహంకారమే నన్నింత గతికి తెచ్చింది. ఇదే నా యిల్లు. ఇది తప్ప వేరే చోటు నాది ఏమీలేదు. నే నింక ప్రాణముండగా నా ఈ యిల్లు వదలను" అంది గట్టిగా కమల.

ఆమె కంఠంలోని తీవ్రతకి, ఆమె కళ్ళల్లోని నిర్ణయానికి ఆశ్చర్యపోయాడు మూర్తి.